కూటమిలో సాగునీటి ఎన్నికల చిచ్చు

- టీడీపీ నుంచి జనసేనలో చేరిన పలువురు నీటి సంఘాల అధ్యక్షులు
- వారికి జనసేన కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్
- కూటమి పొత్తు ధర్మం పాటించని ఎమ్మెల్యేపై తెలుగు తమ్ముళ్ల ఆగ్రహం


జనసేనలో చేరిన టీడీపీ సాగునీటి సంఘాల అధ్యక్షులతో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గంలో సాగునీటి సంఘ ఎన్నికలు కూటమి పార్టీల మధ్య చిచ్చురేపింది. టీడీపీ నుంచి గెలిచిన కొంతమంది నీటి సంఘ అధ్యక్షులను స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ జనసేనలోకి చేర్చుకోవడం పట్ల తెలుగు తమ్ముళ్లు భగ్గుమంటున్నారు. కూటమిలో ఉంటూ ఇదేం పొత్తు ధర్మమని వారు ప్రశ్నిస్తున్నారు. నలుగురు సాగునీటి సంఘాల అధ్యక్షులు టీడీపీని వీడి జనసేన తీర్థం పుచ్చుకున్నారు. కూటమికి చెందిన అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వీరికి జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించడం తెలుగు తమ్ముళ్లు జీర్ణించుకోలేక పోతున్నారు. కోడూరు మండలం సాలెంపాలెం, వి.కొత్తపాలెం సాగునీటి సంఘాల అధ్యక్షుడు బడే భవన్నారాయణ, రేపల్లె రవీంద్ర, నాగాయలంక మండలం నంగేగడ్డ సాగునీటి సంఘం అధ్యక్షుడు భావిరెడ్డి రవీంద్ర, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, కె.కొత్తపాలెం సాగునీటి సంఘ అధ్యక్షుడు మత్తి నాగేశ్వరరావు, డీసీ మాజీ వైస్ చైర్మన్ కాగిత రామారావు, సొసైటీ మాజీ డైరెక్టర్లు మల్లా వెంకటేశ్వరరావు, బెల్లంకొండ సుబ్బారావుకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆయన తనయుడు వెంకట్రామ్ జనసేన కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

పెరుగుతున్న అగాథం..

పొత్తు ధర్మానికి తూట్లు పొడుస్తూ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ జనసేన ప్రాబల్యం పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కొంత మంది టీడీపీ నేతలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీకి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని, తనకు అనుకూలమైన వ్యక్తులకు పట్టం కట్టారని విమర్శలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ ప్రజాప్రతినిధులను ఏ ప్రభుత్వ కార్యక్రమానికి పిలవడం లేదని కొంతమంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుమారుడు మండలి వెంకట్రామ్(రాజా)కి జనసేనలో ఎలాంటి పదవి లేకపోయినా ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయిస్తూ టీడీపీ ఎంపీటీసీలకు కనీసం కార్యక్రమాలకు పిలవక పోవడం పట్ల రగిలిపోతున్నారు.

జనసేనలోనూ అంతర్గత కుమ్ములాట

కోడూరు మండలంలో ఎనిమిది సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఒక్కరు జనసేనకు చెందిన వారు లేరు. రాత్రికి రాత్రి పేర్లు మార్చేశారని కొంతమంది జనసేన నేతలు విమర్శిస్తున్నారు. కోడూరు మండల జనసేన అధ్యక్షుడు మర్రే గంగయ్యకు డీసీ చైర్మన్ ఇస్తారని ప్రచారం జరిగింది. చివరికి ఆయనకు సాగునీటి సంఘం అధ్యక్ష పదవి కూడా ఇవ్వకుండా మొండి చెయ్యి చూపడంతో ఎమ్మెల్యేపై ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. కోడూరుకు చెందిన మరో జనసేన నేత నీటి సంఘ అధ్యక్ష పదవి ఇస్తామని చెప్పి చివరికి టీడీపీ నేత బంధువుకు ఇవ్వడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. మండపాకలో ఇదే పరిస్థితి జనసేనకు కాకుండా టీడీపీకి చెందిన వారికి నీటి సంఘ అధ్యక్ష పదవి కట్టబెట్టడం పట్ల జనసేన నాయకులు అలక వహించినట్లు తెలిసింది. అందుకే టీడీపీ వారిని జనసేనలోకి చేర్చుకుని వారికి డీసీ చైర్మన్ ఇచ్చేలా వ్యూహరచన చేసి అసమ్మతిని చల్లార్చే పనిలో అధినాయకుడు ఉన్నట్లు సమాచారం. గత శాసనసభ ఎన్నికలకు ముందు జనసేనను పిల్లల పార్టీగా అభివర్ణించిన బుద్ధప్రసాద్ ఆ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం విదితమే. ఇప్పుడు నియోజకవర్గంలో టీడీపీని దెబ్బకొట్టి జనసేన ప్రాబల్యం పెంచుకునేందుకు చూడటం పట్ల టీడీపీ నేతలు ఆగ్రహంతో ఉన్నారు. మొత్తానికి సాగునీటి సంఘాల ఎన్నికలు టీడీపీ జనసేన మధ్య చిచ్చురేపగా, జనసేనలోనూ అంతర్గత కుమ్ములాటకు తెరలేపినట్టయింది.

క్లుప్తంగా

వైభవంగా పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు



పెడన: పట్టణంలో వేం చేసి ఉన్న శ్రీపైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారంతో మూడో రోజుకు చేరాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానికులు శిడిబండ్లను కట్టి పట్టణంలో ఊరేగిస్తూ, నృత్యాలు చేస్తూ పసుపు చల్లుకుంటూ అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో టీవీవీ మోహనరావుతో పాటు దేవదాయ శాఖ సిబ్బంది, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీసుల పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు.

పడతడికలో 204 మందికి వైద్య పరీక్షలు



కృత్తివెన్ను: మండలంలోని పడతడిక గ్రామంలో సర్పంచ్ మందపాటి ప్రదీప్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన ప్రముఖ పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారు ఈ వైద్య శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ ఆర్థో పీవీఆర్, కార్డియాలజిస్ట్ సందీప్, గైనకాలజిస్ట్ మాధురి, వైద్యులు హర్షిత్‌లు పాల్గొని ఈ శిబిరంలో మొత్తం 204 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేసినట్లు ప్రదీప్ తెలిపారు. తీర ప్రాంత గ్రామాలలో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరమని ఆయన అన్నారు.

మార్గశిర పౌర్ణమి వెలుగు



నాగాయలంక: మార్గశిర ఆధ్యాత్మిక వెలుగులు విరజిమ్ముతున్న చందంగా ఆదివారం రాత్రి నాగాయలంక సెంటర్ నుంచి ప్రకాశించిన చంద్రోదయం దృశ్యమిది. తూర్పు దిక్కున కనిపించిన నిండు పౌర్ణమి చంద్రుడు ఉదయించిన ఈ సమయంలో బంగారు వర్ణంతో వినూత్న కాంతులతో శోభాయమానంగా కనిపించడంతో పౌర్ణమి చంద్రుడిని జనం ఆసక్తిగా తిలకించారు. ఆకర్షణీయ చంద్ర ప్రకాశాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించాము.

31 వరకు ఫసల్ బీమా గడువు పెంపు

గూడూరు: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం గడువు ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కె.ఆంజనేయ ప్రసాద్ తెలిపారు. రబీకి సంబంధించి మండలంలో మినుములు, వరి, మొక్కజొన్న, పెసర సాగు చేస్తున్న రైతులు సీఎస్‌సి సెంటర్లలో పంట బీమా చేయించుకోవాలన్నారు. వరి, మొక్కజొన్న పంటలకు రూ.84, మినుము పంటకు రూ.80, పెసర పంటకు రూ.36 ఎకరానికి ప్రీమియం చెల్లించాలన్నారు. బీమా నమోదుకు రైతు సేవాకేంద్రంలో సంప్రదించాలని చెప్పారు.

నేడు గురువిందగుంటలో రెవెన్యూ సదస్సులు

పెడన: మండల పరిధిలోని గురువిందగుంట గ్రామ సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువిందగుంట గ్రామ సచివాలయంలో ఉదయం 9 గంటలకు కొంగంచర్ల, కుమ్మరిగుంట గ్రామాలకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి గురువిందగుంట, కవిపురం గ్రామాలకు రెవెన్యూ సదస్సులుంటాయన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఆయా సమయాల్లో భూ సమస్యలుంటే లిఖితపూర్వకంగా తెలియజేసి అర్జీలు సమర్పించాలని అనిల్‌కుమార్ సూచించారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

అవనిగడ్డ: విద్యుత్‌ను ప్రతి ఒక్కరూ పొదుపు వినియోగించాలని విద్యుత్ డీఈఈ నడకుదుటి సుబ్రహ్మణ్యేశ్వరరావు చెప్పారు. విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వంతెన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ఒక కిలో వాట్ విద్యుత్ ఆదాకు రూ.30 వేలు ఆదా చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఈలు ఎస్‌వీవీ సత్యనారాయణ, వెంకటరాజు, కె.గోపీచంద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీకి మాజీ ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు పేర్ని మధుసూదనరావును మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సోమవారం పరామర్శించారు. ఆయన తల్లి భోగేశ్వరమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో మధుసూదనరావు నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మధుసూదనరావు, ఆయన సోదరులు వీర వెంకట సత్యనారాయణ, మాధవేంద్రరావును సింహాద్రి పరామర్శించారు. ఆయనతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

దొరకని చిన్నారి ఆచూకీ

అవనిగడ్డ: మూడు రోజుల క్రితం అదృశ్యమైన స్థానిక లంకమ్మ మాన్యానికి చెందిన ఆవుల దివ్య ఆచూకీ లభించలేదు. అవనిగడ్డలోని పలు ప్రాంతాల్లో పోలీసులు గాలిస్తున్నారు. పంట కాలువలోనూ గాలింపు చర్యలు చేపట్టారు. దివ్య ఆచూకీ కోసం తల్లిదండ్రులు, బంధువులు ఎదురుచూస్తున్నారు.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు ప్రారంభం


విశేష అలంకరణలో సీతారామచంద్రులు


ఉల్లిపాలెంలో శ్రీమన్నారాయణుడి ఉత్సవమూర్తులు


ఆలయంలో తిరుప్పావై పఠిస్తున్న మహిళలు

నాగాయలంక: మండలంలోని పలు వైష్ణవ ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ధనుర్మాస ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. నాగాయలంకలోని పురాతనమైన శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం వేకువజాము నుంచి వేద మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజ అరంభించారు. ధర్మకర్త శిష్టా విశాలక్షి నేతృత్వంలో ధనుర్మాసోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఆలయ అర్చకుడు డీవీకే సత్యప్రసాద్ నేతృత్వంలో ఆలయంలోని శ్రీరుక్మిణీ, శ్రీసత్యభామ సమేత శ్రీవేణు గోపాలస్వామి మూల విరాట్‌లకు, గోదాదేవి చిత్రపటాలకు విశేష అలంకారం చేశారు. గ్రామంలోని సబ్బినేని బజారు రామాలయంలో సబ్బినేని బాబు భవానీవరప్రసాద్ సుజాత దంపతుల పర్యవేక్షణలో దీవి మురళీఆచార్యులు బ్రహ్మత్వంలో పూజలతో ధనుర్మాస ఉత్సవాలను ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో అయ్యప్ప దీక్షాపరులు స్వామివారిని దర్శించుకున్నారు. మురళీ ఆచార్యులు బ్రహ్మత్వంలో నాగాయలంక తూర్పు బజారు రామాలయంలో ఘనంగా ధనుర్మాస వేడుక పూజ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, గ్రామస్తులు సీతారాములు, గోదాదేవిని దర్శించుకున్నారు.

అభినవ మేల్కోటలో ధనుర్మాస శోభ

కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామీజీ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి మూలమూర్తికి తొలిరోజు అభిషేకాలను నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్ది భక్తులకు దర్శనమందించారు. ఉత్సవ మూర్తులకు తిరుమంజనసేవను నిర్వహించారు. తిరుప్పావై పాశుర పఠనాన్ని భక్తిప్రపత్తులతో ప్రారంభించారు. నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు ఉంటాయని అష్టాక్షరీ స్వామిజీ తెలిపారు. కోడూరు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో ధనుర్మాస పూజలను ప్రారంభించారు. మహిళలు వేకువజామునే ఆలయాలకు వెళ్లి స్వామివార్లను దర్శించుకున్నారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

పెడన: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస వ్రత మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువ జామున స్వామివారికి సుప్రభాత సేవ, అండాళ్ల గోష్టి, మహిళా భక్తులు మంగళహారతులతో దేవాలయానికి చేరుకుని గోదా శ్రీనివాస స్వామి అష్టోత్తర శత నామావళి పఠించారు. గోదాదేవి పాడిన పాటలు తిరుప్పావై భక్తిశ్రద్ధలతో పఠించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అగ్నిహోత్రం హరికృష్ణ ధనుర్మాస వైభవాన్ని, తిరుప్పావై లోని మొదటి పాశుర అర్థాన్ని భక్తులకు వివరించారు. ఆలయ ఈవో తిక్కిశెట్టి వీర వెంకట మోహన్‌రావు, ఆలయ కమిటీతో పాటు స్వామివారిని దర్శించుకున్నారు.

రామలింగేశ్వరస్వామికి విశేష అభిషేకాలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం వద్ద కృష్ణానదిలోని శ్రీగంగ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి మండపంలో శివలింగానికి ఆరుద్ర నక్షత్రం విశిష్టతను పురస్కరించుకుని శివయ్యకు ప్రీతిపాత్రమైన సోమవారం విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మశ్రీ అంబా సాయికిరణ్ శర్మ నేతృత్వంలో క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు భక్తులతో కలిసి వివిధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. సబ్బినేని శివప్రసాద్(గోల్డ్ శివ), ఉప్పల లీలాకృష్ణప్రసాద్, బోయపాటి రాము, తలశిల రఘుశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భావదేవరపల్లి(నాగాయలంక): మార్గశిర మాసం, పాడ్యమి, ఆరుద్ర నక్షత్రం సమ్మిళిత పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో విశ్వేశ్వరుడు, వినాయకస్వామి వార్లకు ఆరుద్రోత్సవం నిర్వహించారు. అర్చకుడు బ్రహ్మశ్రీ కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో పసుపు కుంకుమలు, వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అయ్యవారికి అభిషేక నివేదన తదుపరి కుంకుమతో శోభాయమానగా అలంకరించి, వినాయకుడిని పవిత్రమూర్తి స్వరూపంతో తీర్చిదిద్దారు. వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజన రావు పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారి ఆరుద్రోత్సవం తిలకించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు.

నాగాయలంక: మార్గశిర ఆరుద్రోత్సవం సందర్భంగా స్థానిక శ్రీపార్వతీ సమేత శ్రీకన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయ చైర్మన్ చిట్టా సాంబశివరావు నేతృత్వంలో అర్చకుడు బ్రహ్మశ్రీ కొల్లిపర సుబ్బారావు నేతృత్వంలో నగరేశ్వరునికి 11 రుద్రాలతో మహన్యాస పూర్వక అభిషేకాలు జరిపారు. విభూధి అభిషేకం తదుపరి శివయ్యకు అలంకరణ జరిగింది. భక్తులు అభిషేకాలను తిలకించారు. దేసు సత్యనారాయణ, తాడికొండ సత్యనారాయణ, ఆకుతోట సీతారామయ్య, చిట్టా శివనాగేశ్వరరావు, వంకాయల ఆదిరాజేష్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పెంపకంతోనే విద్యార్థుల ఉన్నతి


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నంటౌన్: తల్లిదండ్రుల పెంపకంపైనే విద్యార్థుల ఉన్నతి ఆధారపడి ఉంటుందని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్థానిక పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం వార్షికోత్సవం సోమవారం రాత్రి జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు వారి పిల్లలతో ఎక్కువ సమయం గడిపితే వారి పిల్లలే ఉన్నత విద్యావంతులై అత్యున్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివే విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. పిల్లల కదలికలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని చెప్పారు. బెల్ కంపెనీ ఏజీఎం బి.సహదేవుడు మాట్లాడుతూ నిరంతర శ్రమ, లక్ష్యంపై గురి ఉన్నవారు అత్యున్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. విద్యాలయం ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేసిన ఉపాధ్యాయులకు, విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, ఫిల్టర్ బెడ్లకు మరమ్మతులు చేయించాలి

ఘంటసాల: మండల కేంద్రమైన ఘంటసాలలో నిరుపయోగంగా ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, ఫిల్టర్ బెడ్లు మరమ్మతులు చేయించాలని కోరుతూ మాజీ సర్పంచ్, ఏపీ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు అందె జగదీష్ సోమవారం మీ కోసంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ ఘంటసాల గ్రామ పంచాయతీలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో గుర్రపుడెక్క, తూటుకాడ, ఇతర వ్యర్థపదార్థాలతో నిండిపోయి నిరుపయోగంగా ఉందన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును అభివృద్ధి చేసి ఫిల్టర్ బెడ్లను మరమ్మతులు, మోటార్లు, షెడ్లు, పైపులైన్లు, రిటైనింగ్ వాల్ నిర్మాణం, బెడ్ కాంక్రీటు, షంప్‌వెల్ కాంక్రీటు, ఇతర పనులకు రూ.1.25 కోట్లు అవుతాయని అంచనాలు వేశారు. నాలుగు నెలల్లో ప్రారంభమైయ్యే వేసవిని దృష్టిలో ఉంచుకుని ఈ నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించి గ్రామ పంచాయతీ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని జగదీష్ తెలిపారు.

పృథ్వీ మోహన్ బూటకపు ఎన్‌కౌంటర్‌పై ఖండన

ఘంటసాల(అవనిగడ్డ): చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణ్‌పూర్ జిల్లాలో ఈ నెల 12న మావోయిస్టు పృథ్వీ మోహన్(65) బూటకపు ఎన్‌కౌంటర్‌ను ఖండిస్తున్నట్లు ఏపీ పౌరహక్కుల కృష్ణా జిల్లా కార్యవర్గ సభ్యుడు జక్కా కేశవరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుత వృద్ధాప్యంలో ఉన్న పృథ్వీ మోహన్‌తో పాటు అమాయకులైన గిరిజనులను భద్రతాదళాలు బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో పొట్టనబెట్టుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌కౌంటర్ చేసిన తర్వాతే పృథ్వీ మోహన్‌తో పాటు మిగిలిన వారికి మావోయిస్టు దుస్తులు వేసి చేతిల్లో ఆయుధాలు పెట్టినట్లు ఫొటోలను చూస్తే అనుమానం కలుగుతోందన్నారు. అకాల మరణం చెందిన మావోయిస్టు అంత్యక్రియలు మంగళవారం అతని స్వగ్రామమైన అయిదుగుళ్లపల్లిలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసిందన్నారు. మోహన్ భార్య పద్మ, కుమార్తె భారతి, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. సంతాపం తెలిపిన వారిలో పుష్ప, అరసవల్లి కృష్ణ, భావన, అంజిమ్మ, భారతి, అమరుల బంధుమిత్రులు ఉన్నారు.

కర్రసాములో కృష్ణాజిల్లా క్రీడాకారుల ప్రతిభ



మచిలీపట్నంటౌన్: నెల్లూరులో జరిగిన 1వ జాతీయ కర్రసాము యుద్ధ కళా చాంపియన్‌షిప్ పోటీల్లో కృష్ణాజిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొని 42 స్వర్ణ పతకాలను సాధించారు. జిల్లా నుంచి 22 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరై వారి ప్రతిభను చాటారు. అంతరించి పోతున్న కర్రసాములో పట్టు సాధించి ఏకంగా 42 స్వర్ణ పతకాలను సాధించటం పట్ల కర్రసాము ప్రేమికులు అభినందిస్తున్నారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నానికి చెందిన 8 మంది చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొని 13 స్వర్ణ పతకాలను సాధించారు. వీరిని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రతో పాటు నగర ప్రముఖులు, క్రీడాకారులు అభినందించారు. వీరంతా స్థానిక ఉల్లింగిపాలెంలోని శ్రీ వెంకటేశ్వర అరవింద్ తైక్వాండో అకాడమీలో కర్రసాములో తర్ఫీదు పొందారు. కోచ్ అరవింద్ సత్య వీరికి శిక్షణ ఇచ్చారు.

ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు

మోపిదేవి: స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో దాత సహాయంతో ఏర్పాటు చేసిన నీటిని శుద్ధి యంత్రం (ఆర్వో ప్లాంట్)ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం ప్రారంభించారు. వసతి గృహ అధికారి యాసం నాగలక్ష్మి ఇక్కడి తాగునీటి ఇబ్బందులను కోడూరు మండలం ఉల్లిపాలెం యూపీస్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నాగభూషణం దృష్టికి తీసుకెళ్లారు. కోడూరు పూర్వ విద్యార్థి కెనడాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పాదాల నవీన్‌ని ఆయన సంప్రదించగా ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా దాత నవీన్, నాగభూషణం మాస్టారును ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అభినందించారు. వసతి గృహ అధికారులు పెదసింగు బాబూరావు, చిలకా శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి కార్నియాల సేకరణ


వెంకటేశ్వరరావు (ఫైల్)

పెదకమ్మవారిపాలెం(నాగాయలంక): మండలంలోని పెదకమ్మవారిపాలెం శివారు చినకమ్మవారిపాలెం గ్రామానికి చెందిన ఉప్పల వెంకటేశ్వరరావు(65) అనారోగ్యంతో సోమవారం మరణించగా ఆయన కార్నియాలను స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ద్వారా తాడిగడపలోని ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. మరో ఇద్దరికి చూపునిచ్చే అవకాశం కల్పించాలనే సంకల్పంతో ఆయన భార్య శివ పార్వతి, కుమారులు విద్యాసాగర్, విజయభాస్కర్ ఇతర కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా నేత్ర దానానికి ముందు కొచ్చారు. సేవాసంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకటనారాయణలను సంప్రదించడంతె కార్నియాలను సేకరించారు. తమ సంస్థ ద్వారా ఇప్పటి వరకు 216 మంది కార్నియాలను సేకరించామని రఘుశేఖర్ చెప్పారు.

ముగిసిన షష్ఠి ఉత్సవాలు

బంటుమిల్లి: మండల పరిధిలోని నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు జానకీరామపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత 11 రోజులుగా జరుగుతున్న షష్ఠి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం స్వామివారి ప్రధాన మూర్తులకు, ఉత్సవ మూర్తులకు ట్రస్టీ గంగిశెట్టి దేవానంద్ దంపతుల దీక్షధారణతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నపురానికి పూజలు చేసి సమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.

వృద్ధులకు భోజనం ప్యాకెట్ల అందజేత

అవనిగడ్డ: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానాన్ని పురస్కరించుకుని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. సంఘం అధ్యక్షుడు కొల్లిపర రాధాకృష్ణ ఆర్థిక సహాయంతో అనాథ వృద్ధులు, దివ్యాంగులకు భోజనం ప్యాకెట్లు అందజేశారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కోడూరు: మండలంలోని సాలెంపాలెం గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణాన్ని సోమవారం ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద సుమారు రూ.10 లక్షలతో 300 మీటర్ల మేర నూతన రహదారిని నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులను కూటమి నేతలు పరిశీలించారు. గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ జెడ్పీటీసీ బండే శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో బిక్ష ఏర్పాటు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లిలో వేం చేసి ఉన్న శ్రీరుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాలస్వామివారి ఆలయంలో అయ్యప్ప, భవానీ స్వాములకు సద్ది, బిక్షలు సోమవారం ఏర్పాటు చేశారు. గత 41 రోజులుగా దాతల సహకారంతో రోజుకు రెండు పూటల ఆహారాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు గంధం వీరాంజనేయులు దంపతులు తెలిపారు. 41వ రోజు హైదరాబాద్ వాస్తవ్యులు విన్నకోట వెంకటేశ్వరావు, రమాదేవి దంపతుల ఆర్థిక సహకారంతో 70 మంది స్వాములకు సద్ది, బిక్ష ఏర్పాటు చేశామన్నారు. దాత కుటుంబ సభ్యులు ఆత్మకూరి వరప్రసాద్, సుహాసిని, జస్వంత్, గీతశ్రీతో పాటు అయ్యప్ప, శివ స్వాములు, భవానీలు, పలువురు యాత్రికులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

గూడూరు: మండలంలో మంగళవారం నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో బి.రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళ, బుధవారాల్లో గూడూరు-1 గ్రామ సచివాలయంలో, గురు, శుక్రవారాల్లో ఆకులమన్నాడు గ్రామ సచివాలయంలో ఆధార్ క్యాంపులు జరుగుతాయన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామానికి చెందిన జె.రాణికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.81 వేలు మంజూరైనట్లు ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్నా) తెలిపారు. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న రాణి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవడంతో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ చొరవతో రూ.81 వేలు మంజూరైనట్లు తెలిపారు. టీడీపీ నాయకులు దాసం రామకృష్ణ, పావులూరి పసి, జె.శ్రీనివాస్, టి.ప్రసాద్ పాల్గొన్నారు.

13 మందికి చెక్కుల అందజేత

అవనిగడ్డ: స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్(రాజా) తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

పెడన: అత్తింటి వేధింపులపై ఓ వివాహిత పెడన పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. పెడన పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెడన మండలం కాకర్లమూడి గ్రామానికి చెందిన అర్జా మౌనిక(30)తో గుంటూరు జిల్లా వెంపరాల గ్రామానికి చెందిన అర్జా శైలబాబుతో 2019లో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు. భర్త శైలబాబు, మామ శివసత్యనారాయణ, అత్త తులసమ్మలు తనను శారీరకంగాను, మానసికంగాను వేధింపులకు గురి చేస్తున్నారంటూ మౌనిక ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై నేటి నుంచి శిక్షణ

నాగాయలంక: స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ-2025, 26పై నాగాయలంక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో 17, 18 తేదీలలో ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జె.కె.సీతారామ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అందరికీ ఈ శిక్షణ జరుగుతుందన్నారు. ఉదయం 9.30 గంటలకు ఆరంభమయ్యే శిక్షణ కార్యక్రమానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తప్పనిసరిగా సకాలంలో హాజరు కావాలని సూచించారు.